## • చిత్రకూట గిరి.. విచిత్ర జలసిరి..

నింగి వీడిన వానధార నేలను చేరగానే సంతోషిస్తుంది. ఆపై ప్రవాహమై తటాలున ఓ తటాకాన్ని తాకితే తన్మయత్వం చెందుతుంది. వడివడిగా కాల్వను చేరగానే పరవశించి ప్రవహిస్తుంది. అదే వేగంతో తరంగిణి ఒడిలో చోటు దొరికితే ఉప్పొంగిపోతుంది. అక్కడితో తన జన్మ తరించిందని భావించదు. పాయలుగా విడిపోతే కుంగిపోదు. లోయల్లో పడిపోతే బెంబేలెత్తిపోదు. చిటారు కొండ మీది నుంచి దబాలున దూకినప్పుడు మాత్రం దాని ఒళ్లంత తుళ్లింతే! ఆ వైచిత్రికి సచిత్ర సాక్ష్యమే ఈ చిత్రకూట జలపాత దృశ్యం. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జగదల్‌పూర్ సమీపంలో ఉంటుంది చిత్రకూట్ జలపాతం. దండకారణ్యం కొండల్లో ప్రచండంగా ప్రవహిస్తూ నిండుగా కనువిందు చేస్తుందీ అఖండ జలసిరి.

